సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



రాజన్నకు భక్తుల తాకిడి

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తడిబట్టలతో మొక్కులు చెల్లించుకున్నారు.



రైల్వే కేటాయింపులు భేష్!

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కరీంనగర్ రైల్వేకు పెద్దపీట వేశారు. ఏకంగా రూ.647 కోట్లను కేంద్రం కేటాయించింది. - 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం 30.0/15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

మత్తడి కూల్చొద్దని రైతుల నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

ఇల్లంతకుంట(మానకొండూరు): మండలంలోని అనంతారం పెద్దచెరువు మత్తడిని కూల్చొద్దని రైతులు బుధవారం నిరసన తెలిపారు. పెద్దచెరువులోకి అనంతగిరి రిజర్వాయర్ నుంచి డీ1 కెనాల్ ద్వారా నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. పెద్దచెరువును పూర్తిస్థాయిలో నింపితే కాళేశ్వరం అదనపు టీఎంసీ పైపులైన్ నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు భావించారు. దీనికి పరిష్కారంగా పెద్దచెరువు మత్తడిని కూల్చివేయాలనుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు, మత్స్యకారులు అడ్డుకున్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు



హరిదాస్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు పేర్కొన్నారు. హరిదాస్‌నగర్‌లో బుధవారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలంలో మొదటిదశలో 11 గ్రామాలను ఎంపికచేసి లబ్ధిదారులను గుర్తించామన్నారు. వారందరికీ ఇళ్లు నిర్మించి అందజేస్తామన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ అమృత, ఎంపీటీసీ మల్లేశం ఉన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

సిరిసిల్లటౌన్: మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి పేర్కొన్నారు. వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలోని జేఎన్టీయూలో మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు, వృద్ధులు, బాలలు, దివ్యాంగులకు గల హక్కులు, చట్టాలను వివరించారు. ఈ సమావేశంలో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీఐ వెంకటేశ్, విజయకుమార్, సఖీ కేంద్రం ఇన్‌చార్జి రోజా, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి సుచరిత తదితరులు పాల్గొన్నారు.

7, 16, 27 తేదీల్లో సదరెం శిబిరాలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యశాలలో ఫిబ్రవరి 7, 16, 27 తేదీల్లో సదరెం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు శుక్రవారం తెలిపారు. 7న కంటిచూపు, 16న ఆర్థోపెడిక్, 27న మానసిక దివ్యాంగులకు పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. కొత్తగా వచ్చేవారు, సర్టిఫికెట్ రెన్యూవల్ చేసుకునే వారు మీసేవ కేంద్రాల్లో స్లాట్‌బుక్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మెడికల్ డాక్యుమెంట్స్, ఎక్స్‌రేతోపాటు ఫోన్ నంబరు వెంట తీసుకురావాలని తెలిపారు.

సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు, డ్రైవింగ్ చేస్తున్నపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. డిపో మేనేజర్ మనోహర్, ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.రాజు, వైవిరావు, సారయ్య, రాంరెడ్డి, రామ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

4,159 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కంటివెలుగులో భాగంగా 4,159 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 676 మందికి రీడింగ్ అద్దాలు, 429 మందికి పాయింట్ గ్లాసులను అందించారు. మొత్తం 26 క్యాంపుల్లో 234 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

- 'సెస్' గ్రామ ప్రాతినిధ్య సభ్యుల ఎన్నికలు
- ఏకగ్రీవానికే ప్రాధాన్యం
- ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి
- బైలా ప్రకారం విలేజీ ప్రతినిధుల ఎన్నికలు
- చైర్మన్ చిక్కాల రామారావు



సిరిసిల్ల 'సెస్' ఆఫీస్ భవనం

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరోసారి ఎన్నికలకు తెరలేచింది. జిల్లాలో విద్యుత్ పంపిణీ సేవలు అందించే సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్)కు ప్రాతినిధ్య సభ్యుల(విలేజీ ప్రతినిధుల)ను ఎన్నుకుంటున్నారు. ఫిబ్రవరి 10వ తేదీలోగా జిల్లాలోని 255 గ్రామాల్లో, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లోనూ 'సెస్' ప్రతినిధుల ఎన్నిక పూర్తికానుంది. ఈమేరకు 'సెస్' పాలకవర్గం ప్రణాళికను సిద్ధం చేయడంతో క్షేత్రస్థాయిలో ఎన్నికల సందడి మొదలైంది.

మహాసభల్లో ఎంతో కీలకం

జిల్లాలోని 'సెస్' సంస్థలో ఏ పని చేయాలన్నా మహాసభ తీర్మానం ప్రధానం. మహాసభ తీర్మానంతో కీలకమైన పనులు ముందుకుసాగుతాయి. సెస్ సంస్థ నిర్వహించే ఈ మహాసభకు ఇప్పుడు ఎంపికయ్యే గ్రామ ప్రాతినిధ్య సభ్యులు హాజరవుతారు. మెజార్టీ సభ్యులు చేతులెత్తి, లేదా చప్పట్లు కొట్టి ఆమోదిస్తేనే కీలకమైన పనులు జరుగుతాయి. సెస్ పాలకవర్గం మహాసభలో తీర్మానాలపై ఆధారపడి నిర్ణయాలు తీసుకుంటున్నారు. 'సెస్' బైలా ప్రకారం మహాసభ ఆమోదంలో విలేజీ ప్రతినిధులదే ముఖ్యభూమిక. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో వార్డుకు ఒక్కరు చొప్పున సిరిసిల్లలో 39, వేములవాడలో 28 మంది ప్రతినిధులను ఎన్నుకోవాల్సి ఉంది. జిల్లాలోని 255 గ్రామాల్లోనూ 'సెస్' ప్రాతినిధ్య సభ్యులు ఉంటారు. జగిత్యాల జిల్లా పరిధిలోని కొడిమ్యాల మండలంలోని నల్లగొండ, తిప్పాయపల్లె, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుండారం గ్రామాలు 'సెస్' పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లోనూ 'సెస్' ప్రతినిధులు ఉంటారు. 250 విద్యుత్ కనెక్షన్ల కంటే తక్కువ ఉంటే ఒక్క ప్రతినిధి, అంత కంటే ఎక్కువ కనెక్షన్లు ఉంటూ ఇద్దరిని ఎన్నుకుంటారు. జిల్లాలో సుమారు 600 మంది 'సెస్' ప్రాతినిధ్య సభ్యులు ఉంటారు. ఈ సభ్యులు 'సెస్' మహాసభలకు హాజరై కీలక నిర్ణయాల్లో భాగస్వాములు అవుతారు.

బీఆర్‌ఎస్ ఆధిపత్యం

ఐదేళ్ల పదవీకాలంలో ఉండే 'సెస్' విలేజీ ప్రతినిధుల ఎన్నికల్లోనూ అధికార బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులే ఎన్నికయ్యే అవకాశం ఉంది. డిసెంబరు 25న జరిగిన 'సెస్' ఎన్నికల్లో 15 స్థానాల్లోనూ బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీ రహితంగా సాగే 'సెస్' ఎన్నికల్లో పార్టీ ప్రభావం ప్రధానంగా కనిపించింది. జిల్లా వ్యాప్తంగా 'సెస్'లో 2.80 లక్షల మంది సభ్యులు ఉండగా.. 87,130 మందికి మాత్రమే ఓటుహక్కు ఉంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 73,694 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులకు 40,138 ఓట్లు రాగా, బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు 18,853 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు 7,579 ఓట్లు వచ్చాయి. స్వతంత్రులకు 6,271 ఓట్లు రావడం విశేషం. ఇప్పుడు జరుగుతున్న గ్రామ ప్రతినిధుల ఎన్నికలోనూ అధికార బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లోనూ బీఆర్‌ఎస్ చైర్‌పర్సన్లు ఉండడం, 12 మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. ఒక్క చందుర్తిలో కాంగ్రెస్ జెడ్పీటీసీ, వేములవాడ రూరల్‌లో బీజేపీ ఎంపీపీ ఉన్నారు. మిగతా అన్ని స్థానికసంస్థల స్థానాల్లో అధికార పార్టీ బలంగా ఉండడంతో ఆ పార్టీ మద్దతుదారులు 'సెస్' గ్రామ ప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఎక్కువ మందిని ఏకగ్రీవంగానే ఎన్నుకోవాలని భావిస్తున్నారు. పోటీ అనివార్యమైన చేతులు ఎత్తే విధానంలో విలేజీ ప్రతినిధులను ఎంపిక చేస్తారు. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ ప్రాబల్య గ్రామాల్లో ఆ పార్టీల మద్దతుదారులు పోటీపడే అవకాశం ఉంది. సభ్యులైన వినియోగదారులు మద్దతు తెలిపితే ఆ పార్టీలకు చెందిన వారు ఎన్నికయ్యే అవకాశం ఉంది.

బైలా ప్రకారం ఎన్నికలు



'సెస్' బైలా ప్రకారం విలేజీ ప్రతినిధుల ఎన్నికలు నిర్వహిస్తున్నాం. క్షేత్రస్థాయిలో ఎన్నికలపై ప్రచారం చేసి, సమావేశాలు నిర్వహించి ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎంపికయ్యే అభ్యర్థులు 'సెస్' సంస్థకు ఎలాంటి విద్యుత్ బకాయిలు ఉండకూడదు. ప్రస్తుత ఓటరు జాబితాలో ఓటరుగా ఉండాలి. 'సెస్' ఉద్యోగుల కు టుంబ సభ్యులు ఉండవద్దు. బైలా ప్రకారం పారదర్శకంగా ఎన్నికలు పూర్తి చేయాలని పాలక వర్గం నిర్ణయించింది. ఫిబ్రవరి 10వ తేదీలోగా ఎన్నికలు పూర్తిచేస్తాం.

– చిక్కాల రామారావు, 'సెస్' చైర్మన్

భక్తులు ఇబ్బందులు పడొద్దు

- పనులు త్వరగా పూర్తిచేయండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడలో పలు అభివృద్ధి పనుల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ: ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి జాతర మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. వేములవాడలో కొనసాగుతున్న మహాజాతర పనులతోపాటు పట్టణంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలపై గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం పనులు చేయాలని సూచించారు. గుడి చెరువు ఖాళీ స్థలంలో చేపట్టిన తాత్కాలిక మరుగుదొడ్లు, షవర్ బాత్‌రూమ్‌లు, దుస్తులు మార్చుకునే గదుల పనులను పరిశీలించారు. భక్తులకు సమాచారం అందించేందుకు ఏడు చోట్ల 'మే ఐ హెల్ప్ యూ' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీగణపతి కాంప్లెక్స్‌లో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసే బస్తీ దవాఖానా పనులను పరిశీలించారు. బద్దిపోచమ్మ గుడి పక్కనే ఇటీవల ఖాళీ అయిన ఇళ్ల స్థలాల వద్ద భక్తులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో తెలంగాణ క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి ఆట వస్తువులను సమకూర్చాలని ఆదేశించారు. తహశీల్దార్ రాజు, ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఈ స్వామి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో వీపీవోలదే బాధ్యత

- ఎస్పీ అఖిల్ మహాజన్



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

ముస్తాబాద్(సిరిసిల్ల): నేరాల నియంత్రణలో విలేజీ పోలీసు అధికారు(వీపీవో)ల పాత్ర కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఠాణాలో రికార్డులు, సిబ్బంది క్వార్టర్లను పరిశీలించారు. వీపీవోలు వారికి కేటాయించిన గ్రామాలను సందర్శిస్తూ.. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, విధులపై అంకితభావం ఉన్నప్పుడే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. సీఐ ఉపేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై రమణ, సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ముస్తాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ముస్తాబాద్ ప్రధాన కూడళ్ల వద్ద, ఠాణా ఆవరణలో సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభించారు. ఎస్సై వెంకటేశ్వర్లు, ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, సర్పంచ్ సుమతి ఉన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలు

- రూ.1,03,481 స్వాహా
- రికవరీకి అధికారుల ఆదేశం



సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలపై ప్రశ్నిస్తున్న అధికారులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల్లో మేట్‌లు బినామీ కూలీల పేర్లతో డబ్బు స్వాహా చేశారని తేలింది. అంతేకాకుండా మల్యాలలో యంత్రాలతో పనులు చేయించి కూలీల పేరిట చెల్లింపులు చేశారని ఆరోపణలు వచ్చాయి. చందుర్తిలో గల్ఫ్ వెళ్లిన వారి పేరిట, బినామీ కూలీల పేరిట డబ్బులు స్వాహా చేశారని నిర్ధారణకు వచ్చింది. మండలవ్యాప్తంగా రూ.1,03,481 స్వాహా చేసినట్లు తేలింది. స్వాహా చేసిన డబ్బులకు జరిమానా రూ.18వేలు కలిపి రూ.1,21,481 రికవరీకి అడిషనల్ డీఆర్డీవో మదన్ మోహన్ ఆదేశాలు జారీ చేశారు. దుర్వినియోగమైన డబ్బులను వెంటనే చెల్లించాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- కేజీ టు పీజీ క్యాంపస్‌లో ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మధ్యాహ్నం ఆకలి కష్టాలు తీరాయి. టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోంది. శుక్రవారం రవీందర్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు మధ్యాన్న భోజనం కార్యక్రమం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణాధ్యక్షుడు వెంకటియాదవ్, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, గంధ్యాడపు రాజు, లింగంయాదవ్, కూర సురేశ్, అభిలాశ్, నారాయణ, ఎగండి స్వామి, ఖుతుబ్, సందీప్ పాల్గొన్నారు.

ఇళ్ల కోసం కదంతొక్కిన కార్మికులు



వేములవాడలో ర్యాలీ తీస్తున్న కార్మికులు

- అర్హులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వేములవాడ: తమకు ఇళ్లు ఇవ్వాలని కోరుతూ కార్మికులు, సీఐటీయూ నాయకులు శుక్రవారం వేములవాడలోని ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం అధికారులకు వినతిపత్రం అందించారు. గతంలో అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కార్మికులకు ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ఇళ్ల సాధనకు ఈనెల 9న చలో హైదరాబాద్ చేపట్టనున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ప్రకటించారు. నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, మూషం రమేశ్, గుర్రం అశోక్, గురజాల శ్రీధర్, అన్నల్‌దాస్ గణేశ్, రామంచ అశోక్, ముక్తికాంత అశోక్, ఎరవెల్లి నాగరాజు, సూరం పద్మ, జవ్వాజి విమల, మల్లారపు ప్రశాంత్, చిలుక బాబు తదితరులు పాల్గొన్నారు.

మద్యంమత్తులో వాహనాలు నడిపితే జైలుకే

- సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్



మాట్లాడుతున్న డీఎస్పీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యంమత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి, జైలుకు పంపుతామని సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ హెచ్చరించారు. విద్యార్థులపై తల్లిదండ్రులతోపాటు పాఠశాలల యాజమాన్యాలు సైతం అంతే శ్రద్ధ చూపాలన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, డ్రైవర్లు, క్లీనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ స్కూల్ బస్సులకు బీమా, ఫిట్‌నెస్, రోడ్డు టాక్స్ చెల్లించాలని, డ్రైవర్‌లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. వాహనాలు యూ టర్న్ తీసుకునేటప్పుడు.. డ్రైవరు, క్లీనర్ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సులలో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించొద్దని సూచించారు. ఎస్సై శేఖర్, మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

భూమి ఉన్నా.. లాభం లేదు !

- అందని రైతుబంధు, రైతుబీమా
- బ్లాక్‌లిస్ట్‌లో మర్రిపల్లి దళితుల భూములు
- యాభై ఏళ్ల క్రితం పంపిణీ చేసిన ప్రభుత్వం
- ఆందోళనలో 70 మంది రైతులు



- ఈ చిత్రంలో కనిపిస్తున్న వారు పూడూరి ముండయ్య, పండుగ హన్మయ్య, కాశంపల్లి మల్లయ్య, కాశంపల్లి దుర్గయ్య. వీరు వేములవాడరూరల్ మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన దళితులు. గతంలో ప్రభుత్వం వీరికి భూమి పట్టాలు ఇచ్చింది. ప్రస్తుతం ఆ భూములను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో రైతుబంధు, రైతుబీమా, బ్యాంకుల నుంచి రుణాలు రావడం లేదు.



దళితుల కోసం కేటాయించిన భూమిని సాగు చేసుకుంటున్న దళితులు

వేములవాడరూరల్: భూములు సాగుచేసుకొని బాగుపడతాయనే ఉద్దేశంతో యాభై ఏళ్ల క్రితం ప్రభుత్వం దళితులకు పట్టాలు అందజేసింది. అప్పటి నుంచి వారంతా అదే భూమిని నమ్ముకొని బతుకుతున్నారు. ధరణి రాకతో వారి భూములు ప్రస్తుతం బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్లిపోయాయి. ఫలితంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుబంధు, రైతుబీమా పథకాలు అందడం లేదు. బ్యాంక్‌ల నుంచి రుణాలు మంజూరుకావడం లేదు. భూములు ఉన్న లాభం లేకుండా ఉందనే దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మర్రిపల్లిలో 70 కుటుంబాలకు భూమి

వేములవాడరూరల్ మండలంలోని మర్రిపల్లి గ్రామంలో సర్వేనంబర్ 748లో 120 ఎకరాలలో దాదాపు 70 దళిత కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయి. యాభై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అసైన్డ్ భూములలో పట్టాలు అందజేసింది. చాలా మంది రైతులు సాగుచేసుకుంటున్నారు. నీటి సౌకర్యం లేక కొందరు సాగు చేసుకోవడం లేదు. సాగు చేసుకోవడం లేదనే సాకుతో ప్రభుత్వం ఆ భూములను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. పంట నష్టపరిహారం, రైతుబంధు, రైతుబీమాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న దళిత కుటుంబాలు తమకు న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించాయి. మర్రిపల్లి దళితులు తమకు న్యాయం చేయాలంటూ వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబును గతంలో కలిసి విన్నవించారు. ఈనెల 1వ తేదీన మర్రిపల్లికి వచ్చిన ఎమ్మెల్యే రమేశ్‌బాబును కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ అవకాశం దక్కలేదు.

ఉన్నతాధికారుల నిర్ణయం



మర్రిపల్లిలో గతంలో దళితులకు ఇచ్చిన భూ మి విషయంలో మేము నిర్ణయం తీసుకోము. మా చేతిలో ఏమీ లేదు. అంతా ఉన్నతాధికారులు తీసుకోవాల్సిన నిర్ణయం. అయినప్పటికీ రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– ఎండీ వహీదొద్దీన్, ఇన్‌చార్జి తహసీల్దార్, వేములవాడ రూరల్

ప్రభుత్వం ఆదుకోవాలి



గత ప్రభుత్వం నిరుపేదలైన దళితులకు భూములు ఇచ్చింది. ప్రస్తుతం ఆ భూములను బ్లాక్‌లిస్టులో పెట్టడంతో పథకాలు నిలిచిపోయాయి. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి దళితులకు స్థలాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– గొర్రె మనోహర్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు, మర్రిపల్లి

పట్టాలు ఉన్నా ఫలాలు దూరం



మర్రిపల్లిలో గతంలో దళితులకు ప్రభుత్వం స్థలాలు ఇచ్చింది. ఆ స్థలాలు రైతుల పేరిట ఉన్నప్పటికీ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో ప్రభుత్వ పథకాలు రావడం లేదు. మృతిచెందిన రైతు కుటుంబాలకు రైతుబీమా రావడం లేదు.

– అరిగెల వెంకటేశ్, మర్రిపల్లి

క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న గ్రామస్తులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి శివారులో గ్రామ దేవతలు తాతమ్మ, మైసమ్మల విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు. పురాతన కాలంలో నెలకొల్పిన తాతమ్మ, మైసమ్మ విగ్రహాలు శిథిలావస్థకు చేరుకోగా గ్రామస్తుల సహకారంతో నూతన విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. ఎంపీటీసీ పులి రేణుక, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, ఉపసర్పంచ్ సిర్రం తిరుపతి, పులి సత్యం పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

వీర్నపల్లి: దళితబంధు లబ్ధిదారుడి గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్ దళిత బంధుకు ఎంపికై హోటల్ నడుపుతూ జీవిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో గుడిసె కాలిబూడిదైంది. ఈ ఘటనలో రూ.3 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తక్షణ సాయంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్‌కుమార్ రూ.5వేలు, వంటసామగ్రి, జెడ్పీటీసీ కళావతి రూ.5వేలు అందించారు.

డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్థిక గణాంక శాఖ డైరీలను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర జీఎస్‌డీపీ అంచనాలు వేయడానికి ఆర్థిక గణాంకశాఖ పాత్ర కీలకమైందన్నారు. రాష్ట్రస్థాయిలో కుటుంబాల ఆర్థిక స్థితిగతులను సర్వేచేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీవో పీ.బీ.శ్రీనివాసాచారి, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రణధీర్‌కుమార్, ఉప గణాంక అధికారులు, డివిజనల్ ఉప గణాంక అధికారులు, మండల ప్లానింగ్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు


పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

వేములవాడరూరల్: అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు హెచ్చరించారు. మండలంలోని వట్టెంల గ్రామ శివారు నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలించొద్దన్నారు.

ఆ పిల్లలు సేఫ్

- అపరిచితురాలే అపహరించింది!
- పిల్లల కిడ్నాప్ వ్యవహారంలో కొత్తమలుపు
- సీడబ్ల్యూసీ ఎదుట పదేపదే స్టేట్‌మెంట్లు మార్చిన నిందితురాలు
- డబ్బులు అడుగుతున్నారని ఎదురుతిరిగిన నిందితురాలు
- బాధితుల తరఫున మహారాష్ట్ర అధికారులతో మాట్లాడిన 'సాక్షి'
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు


చిన్నారులను కిడ్నాప్ చేసిన నిందితురాలు జయశ్రీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో కిడ్నాపైన చిన్నారుల కథ సుఖాంతమైంది. రైల్వే పోలీసుల అప్రమత్తత, మహారాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ల చొరవతో ఎట్టకేలకు చిన్నారులు తండ్రుల ఒడి చేరారు. ఈ క్రమంలో చిన్నారులను అపహరించిన నిందితురాలు బాధితులపై పలు ఆరోపణలు చేసి వారిని అక్కడ ఇక్కట్లపాలు చేసే యత్నం చేయడం గమనార్హం. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఉదంతం ఆద్యంతం అనేక మలుపులు తిరిగింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బోర్డ్ మెంబర్ రామ్ జాప్తర్ కథనం ప్రకారం.. ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం మంకమ్మతోటకు చెందిన మిడిదొడ్డి లోకేశ్ (9), మాదాసి అక్షిత (11)లను పొరుగున ఉండే జయశ్రీ చాక్లెట్లు కొనిస్తానని తీసుకెళ్లింది. కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైలెక్కి ఔరంగాబాద్‌కు బయల్దేరింది. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో ఔరంగాబాద్ సమీపంలోని జాల్నా రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై దిగిన చిన్నారులను జయశ్రీ కొట్టింది. అంతటితో ఆగకుండా వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ పగలగొట్టింది. వెంటనే స్పందించిన రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు పిల్లలను విచారించి ఆమె నుంచి కాపాడి మహా రాష్ట్ర చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులకు అప్పగించారు. షాక్‌లో ఉన్న పిల్లలకు తొలుత కౌన్సెలింగ్ ఇచ్చి.. చిల్డ్రన్స్‌హోంకు పంపారు.

అర్ధరాత్రి బయల్దేరిన తండ్రులు..

గురువారం రాత్రి విషయం తెలుసుకున్న పిల్లల తండ్రులు మిడిదొడ్డి ప్రవీణ్, మాదాసి సురేశ్‌లు జయశ్రీ భర్త సత్యనారాయణ, ఆమె కుమారుడు శివకుమార్‌తో కలిసి మహారాష్ట్రకు కారులో బయల్దేరి వెళ్లారు. ఉదయం పిల్లల గుర్తింపు ప్రక్రియ పూర్తవగానే.. తల్లిదండ్రులకు అప్పగించారు. తిరిగి వెళ్లే సమయంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు కారులో రావొద్దని జయశ్రీ వాదనకు దిగింది. దీంతో వారు తాము కూలీ పనిచేసుకునేవారిమి అని, తిరిగి వెళ్లేందుకు బస్సు ఖర్చులు ఇవ్వాలని అడిగారు. దీంతో తనను బాధితులు డబ్బులు అడుగుతున్నారని మధ్యాహ్నం సీడబ్ల్యూసీ అధికారుల ముందు జయశ్రీ ఆరోపించింది. జయశ్రీ స్వస్థలం ఔరంగాబాద్. ఆమెది మరాఠీ మాతృభాష. బాధితులు ఉన్నత విద్యావంతులు కాదు. ఇద్దరూ కూలీలే. హిందీ కూడా రాదు. కంగారుపడిన బాధితులు 'సాక్షి'ని ఆశ్రయించారు. దీంతో విషయాన్ని అక్కడి అధికారులకు సాక్షి మొత్తం వివరించింది. అసలు విషయం తెలుసుకున్న అధికారులు వారికి నచ్చజెప్పి వారిని అందరినీ ఒకే కారులో తిరిగి వెళ్లాలని ఒప్పించారు. కార్పొరేటర్ దిండిగాల మహేశ్ కూడా చొరవ తీసుకున్నారు. బాధితులు, నిందితులతో మాట్లాడి వాగ్వాదాలు లేకుండా ఇంటికి రావాలని వారికి ఫోన్‌లో నచ్చజెప్పారు.

ఆంటీ మమ్మల్ని బాగా కొట్టింది..!

కిడ్నాప్‌కు గురైన అక్షిత, లోకేశ్‌లు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. తమను కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించిందని, ఎక్కడికి తీసుకెళ్తున్నావని ప్రశ్నించిన ప్రతీసారి.. మార్గమధ్యలో చాలా కొట్టిందని వాపోయారు. జాల్నాలో రైలు ఆగగానే తాము దిగి ఆమెతో వాగ్వాదానికి దిగామన్నారు. దీంతో ఆమె కోపంతో తమ ఫోన్ పగలగొట్టిందని.. ఇంతలో ఆర్పీఎఫ్ బలగాలు వచ్చి తమను కాపాడారని వివరించారు. అనంతరం మహారాష్ట్ర అధికారులు జయశ్రీ తన వాంగ్మూలాలు పదేపదే మారుస్తుండటంతో తలలు పట్టుకున్నారు. విచారణ సమయంలో.. పిల్లలను తాను దేవుడు వద్దకు తీసుకెళ్తున్నానని ఒకసారి, తమ పనిమనిషి పిల్లలని మరోసారి ఇలా రకరకాల స్టేట్‌మెంట్లు ఇచ్చింది. దీంతో ఆమె మానసిక స్థితిపై వారికి సందేహాలు కలిగాయి. అదే అనుమానంతో అధికారులు తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో అసలు కథ వెలుగుచూసింది. జయశ్రీ కుటుంబ సభ్యులు ముందు నుంచి ఆమెను కాపాడే యత్నం చేస్తున్నారు. బాధితులు జయశ్రీపై ఎక్కడ కిడ్నాప్ కేసు పెడతారో అని వారిని పోలీసుస్టేషన్ వెళ్లకుండా.. తమ కారులో మహారాష్ట్ర తీసుకెళ్లారు. తీరా అక్కడికెళ్లాక వారిని బెదిరింపులకు గురిచేశారు. మహారాష్ట్ర అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. అయితే.. బాధితులు సదరు నిందితురాలిపై కిడ్నాప్ కేసు పెడతామని నిర్ణయించుకున్నారు. దీంతో ఆమెను తెలంగాణకు తీసుకురాకుండా ఆమె స్వస్థలం ఔరంగాబాద్‌కు తరలించే యత్నం చేస్తున్నారు.

హోరాహోరీగా ఎస్పీఎల్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్, వికెట్ తీసిన ఆనందంలో..., సీనియర్స్ విభాగంలో ఫైనల్ చేరిన వివేకానంద కళాశాల జట్టు

నేడు జూనియర్, సీనియర్ ఫైనల్ పోరు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఎస్పీఎల్ సీజన్ 4 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో.. స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్పీఎల్ 4 నేటితో ముగియనుంది. కాగా.. శుక్రవారం మ్యాచ్‌ను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్‌లో క్రీడాకారులకు కొదువ లేదని.. టాలెంట్ ఉన్న వారు ఎందరో ఉన్నారని.. వారి ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఒక ప్లాట్ ఫాం అని పేర్కొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌లో వివేకానంద

సీనియర్స్ విభాగంలో ఉదయం రెండో సెమీఫైనల్ వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్.. ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ జట్ల మధ్య జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్సారార్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. అనంతరం 76 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన వివేకానంద జట్టు కేవలం 6.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. నిఖిల్ 19 బంతుల్లో 2 సిక్స్‌లు, 5 ఫోర్లతో 36 పరుగులు చేయగా.. సాయినాథ్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 27 పరుగులు చేసి జట్టుకు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేశారు.

నేటి ఫైనల్ మ్యాచ్‌లు

జూనియర్స్ ఫైనల్: ఉదయం 9 గంటలకు జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, తిమ్మాపూర్ వర్సెస్ ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల.
సీనియర్స్ ఫైనల్: మధ్యాహ్నం 12 గంటలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ వర్సెస్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల.

రాజన్న సేవలో సినీ ప్రముఖులు


రాజన్నను దర్శించుకున్న సినీ హాస్యనటి శ్రీలక్ష్మి

వేములవాడ: వేములవాడ రాజన్నను నటుడు శత్రు, హాస్యనటి శ్రీలక్ష్మి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రం అందించి ఘనంగా సన్మానించారు. సినీ నటులతో భక్తులు సెల్ఫీదిగారు.


నటుడు శత్రు దంపతులను సన్మానిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్

నీలోజిపల్లిలో పట్టపగలు చోరీ

- బంగారు నగలు, నగదు అపహరణ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నీలోజిపల్లి ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన తిమ్మాపురం సతీశ్ ఇంట్లో శుక్రవారం పట్టపగలు దొంగలు పడ్డారు. ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.30,200 నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాలు. సతీశ్ ఇంటి ముందు గేటుకు తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గేటు తాళం తీయకుండానే లోపలికి ప్రవేశించారు. ఇంటి మెయిన్‌డోర్‌కు వేసిన తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. బెడ్‌రూమ్‌లోని బీరువా తాళం పగులకొట్టి అందులో ఉన్న 11 తులాల బంగారు నగలు, 6 తులాల వెండి రూ.30,200 నగదు చోరీచేశారు. సతీశ్ ఇంటికొచ్చి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు నగలు, డబ్బు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వేములవాడరూరల్ సీఐ బన్సీలాల్, ఎస్సై అభిలాశ్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ బృందం సభ్యులు పరిశీలించారు.


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అభిలాశ్

బైండోవర్లను ఆషామాషీగా తీసుకోవద్దు

- ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్
- ఇప్పటివరకు 1214 మంది బైండోవర్లు
- 41 మందికి జరిమానాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బైండోవర్లను నామమాత్రంగా తీసుకోవద్దని, ప్రభుత్వం కఠినంగా శిక్షలు అమలు చేస్తోందని ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ కార్యాలయంలో నిబంధనలు ఉల్లంఘించిన ఓ మహిళ నిందితురాలు శుక్రవారం జరిమానా చెల్లించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. 2016 నుంచి ఇప్పటివరకు 1214 మందిని వివిధ కేసుల్లో అరెస్టు చేసి బైండోవర్లు చేశామన్నారు. గంభీరావుపేటలో 11 మంది, కోనరావుపేటలో 9, వీర్నపల్లిలో 5, ఎల్లారెడ్డిపేటలో 13, ముస్తాబాద్‌లో ముగ్గురు, చొప్పున 41 మంది జరిమానాలు చెల్లించారన్నారు. మరో ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధించగా వారు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వం జరిమానా రుసుము రూ.లక్షకు పెంచిందని బైండోవర్ అయిన వ్యక్తులపై ఎప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎక్సైజ్ నేరాల నియంత్రణ, నిర్మూలనకు పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు.


జరిమానా చెల్లిస్తున్న నిందితురాలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తోందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లిలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనంతో పాటు రూ.కోటిన్నరతో నిర్మించే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమానికి, గ్రామాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వంపై కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, జిల్లా కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, వైస్ ఎంపీపీ భాస్కర్‌గౌడ్, తహసీల్దార్ జయంత్ కుమార్, మాజీ ఎంపీపీ మోహన్‌కుమార్, సర్పంచ్ ముక్క మధుకర్, ఉపసర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలు తోడు దొంగలు

- ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలి
- రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి/ముస్తాబాద్: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ఇద్దరూ తోడు దొంగలేనని.. చీకటి ఒప్పందంతో ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుతున్నారని రాజన్న సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో, ముస్తాబాద్ సహకార సంఘం ఫంక్షన్‌హాల్‌లో మండలస్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతిని ఎండగట్టాలని ఇంటింటా కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులు పార్టీ అందించిన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలోనే మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణగౌడ్, మహిళా అధ్యక్షురాలు కామిని వనిత, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎస్సీసెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, తంగళ్లపల్లి అధ్యక్షుడు జలగం ప్రవీణ్(టోని), జిల్లా ప్రధానకార్యదర్శి లింగాల భూపతి, యువజన కాంగ్రెస్ నాయకులు చుక్కా రాజశేఖర్, మునిగెల రాజు, గడ్డం మధుకర్(చోటు), గుగ్గిళ్ల భరత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

క్రిమిసంహారక మందుతాగి వ్యక్తిమృతి

వెల్గటూర్: భార్య, కొడుకు మృతిచెందడంతో పాటు, పక్షవాతంతో బాధపడుతూ ఒంటరిగా జీవిస్తూ జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన వెల్గటూర్ మండలం జగదేవుపేటలో నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవుపేటకు చెందిన వేముల రాజేశం (50)కు భార్య నీల, కుమారుడు రఘుపతి, కూతురు రజిత ఉన్నారు. పదేళ్ల క్రితం భార్య నీల మూడేళ్ల క్రితం కుమారుడు రఘుపతి అనారోగ్యంతో మృతిచెందారు. కూతురికి వివాహం కావడంతో అత్తగారింట్లో ఉంటోంది. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్న రాజేశం మానసికంగా కుంగిపోయి అనారోగ్యం పాలయ్యాడు. పక్షవాతం బారినపడి ఎడమచేయి పనిచేయడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి క్రిమిసంహారక మందు తాగడంతో గమనించిన స్థానికులు జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కూతురు చిందం రజిత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.


రాజేశం మృతదేహం

కంకర తవ్వి.. వదిలేశారు !


కంకర తవ్వి వదిలేసిన రోడ్డు, పక్కలకు పోసిన మట్టి

బోయినపల్లి(చొప్పదండి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఇంజినీరింగ్ అధికారుల అలసత్వం వెరసి ప్రయాణికులకు ప్రమాదకరంగా మారింది. మండలంలోని బూర్గుపల్లి నుంచి కోరెం, అనంతపల్లి గ్రామాల మీదుగా కొడిమ్యాల మండలం నల్లగొండ శివారు వరకు రోడ్డు పనులు చేపడుతున్నారు. బూర్గుపల్లి నుంచి కోరెం గ్రామంలోని పశువుల ఆస్పత్రి వరకు సుమారు మూడు కిలోమీటర్ల పొడవు కంకర తవ్వి వదిలేశారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోశారు. పది రోజుల క్రితం కంకర పోసి ఇప్పటి వరకు తొక్కించకపోవడంతో వాహనాలు అదుపుతప్పి గాయపడుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ యాదగిరిని వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

ప్రమాదవశాత్తు పొలంలో పడి వ్యక్తి మృతి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట మండలం లక్ష్మాజిపల్లి గ్రామానికి చెందిన రైతు బద్దిపడిగె నారాయణరెడ్డి(64) ప్రమాదవశాత్తు వ్యవసాయపొలంలో జారిపడి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నారాయణరెడ్డి గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. శుక్రవారం ఉదయం తన వ్యవసాయ భూమిలో నిర్జీవంగా పడి ఉన్నాడు. పొలం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఒడ్డుపై నుంచి కాలు జారి పడి మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు రాజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు.